ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



ఆసిఫాబాద్‌లో నివాళులర్పిస్తున్న పోలీసు కార్యాలయ అధికారులు, సిబ్బంది

వాల్మీకి మహర్షి జయంతిని జిల్లాలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆయన చిత్రపటాలను ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన జీవిత చరిత్రతో పాటు రామాయణ కావ్య రచనను గుర్తుచేసుకున్నారు. మహనీయుల చరిత్రను తెలుసుకుని వారి అడుగుజాడల్లో నడవాలని వక్తలు పిలుపునిచ్చారు.


(మరిన్ని చిత్రాలు 6వ పేజీలో..)

నేడు జిల్లా స్థాయి కళోత్సవ్ పోటీలు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా స్థాయి కళోత్సవ్ పోటీలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ క్వాలిటీ కో-ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్ గురువారం ప్రకటించారు. వోకల్ మ్యూజిక్, సంగీత వాయిద్యాలు, గ్రూపు డ్యాన్స్, థియేటర్ సోలో డ్రామా, చిత్రలేఖనం, పెయింటింగ్, సంప్రదాయ స్టోరీ టెల్లింగ్ అంశాలపై జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల 9, 10 తరగతులు, ఇంటర్ విద్యార్థుల కోసం ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. పాల్గొనే విద్యార్థులు ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని సూచించారు.



ఆదివాసీ గీతం ఆలపిస్తున్న సందర్భంగా నిల్చొన్న వారిలో ఎడమ నుంచి వరుసగా.. ఎస్పీ శ్రీనివాసరావు, రామగుండం సీపీ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఉదయ్, జీసీసీ ఛైర్మన్ తిరుపతి, ఎమ్మెల్యే హరీశ్‌బాబు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎంపీ గోడం నగేశ్, భీం మనవడు సోనేరావు, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్యాంనాయక్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగేశ్వర్‌రావు



అడవి బిడ్డ నినాదం..
అభివృద్ధి విధానం

ఈటీవీ-ఆదిలాబాద్, న్యూస్‌టుడే, ఆసిఫాబాద్: జల్.. జంగల్.. జమీన్ నినాదమే లక్ష్యంగా. పోరుసాగించిన కుమురంభీం వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. రాజకీయాలకతీతంగా మంత్రి సీతక్క సహా కాంగ్రెస్, భాజపా, భారాస ప్రజాప్రతినిధులు దర్బార్‌లో కలిసి పాల్గొనటం కొత్త ఒరవడికి కేంద్ర బిందువుగా నిలిచింది. మంత్రి సీతక్క, ఎంపీ నగేష్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ దండె విఠల్ సహా వివిధ సంఘాల బాధ్యులు ప్రసంగించారు. ఆదివాసీల జీవన విధానం, అభ్యున్నతి, పోడుభూమి సమస్య పరిష్కార కోసం కృతనిశ్చయంతో పనిచేయాలని, ఏజెన్సీలో రహదారులు, సాగు నీరు, తాగునీరు, విద్య, వైద్యం సహా మౌలిక వసతులు కల్పించాలని, భీం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలనే సమాలోచనలతో దర్బార్ సాగింది. ఆదివాసీల సంప్రదాయ రీతిలో కుమురంభీం సహా కుమురం సూరు విగ్రహాలకు నివాళులర్పించారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా భీం జీవిత చరిత్రను వెల్లడించేలా సీడీని విడుదల చేసి గోండి భాషలో ప్రసంగించడం ఆదివాసీల్లో ఉత్తేజాన్ని నింపింది. గతేడాదితో పోల్చితే ఈ దఫా జనప్రవాహం కాస్త తగ్గింది. జైనూర్‌లో ఇటీవల ఆదివాసీ మహిళపై జరిగిన ఘటనతో అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం ముందస్తుగా చేసిన కట్టుదిట్టమైన ఏర్పాట్ల ప్రభావం ఉత్సవ నిర్వహణపై కనిపించింది.

◆ ఎంపీ నగేష్, సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు మిగిలిన నేతలకంటే ముందుగానే వచ్చి నివాళులర్పించినప్పటికీ మంత్రి వచ్చే వరకు వేచి ఉన్నారు. రామగుండం సీపీ శ్రీనివాస్ నేతృత్వంలో ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాస్, మంచిర్యాల



ప్రజా దర్బార్‌కు హాజరైన ప్రజలు

● జోడేఘాట్‌లో కుమురంభీంకు ఘన నివాళి

డీసీపీ భాస్కర్ స్వయంగా జైనూర్ నుంచి జోడేఘాట్ వరకు బందోబస్తు పర్యవేక్షించారు.

◆ **ఎంపీ నగేష్** మాట్లాడుతూ.. నాలుగేళ్ల నుంచి ఐటీడీఏ గవర్నింగ్ బాడీ సమావేశం జరగడం లేదని వెంటనే నిర్వహించాలన్నారు. **కలెక్టర్ వెంకటేష్ దోత్రే** మాట్లాడుతూ.. పుస్తకాల్లో భీం చరిత్ర చదివానని, ఇక్కడ పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. **భీం మనవడు సోనేరావు** మాట్లాడుతూ.. భీం పోరాటంతోనే గుర్తింపు వచ్చిందన్నారు. కానీ ఆదివాసీలకు మాయ మాటలు చెప్పి తప్పుడు పట్టాలు ఇవ్వకుండా చూడాలన్నారు.

◆ **ఎమ్మెల్యే కోవ లక్ష్మి** మాట్లాడుతూ.. గిరి వికాసం కింద ఆదివాసీ భూముల్లో బోర్లు వేయించాలని, కుమురంభీం కట్ట, వట్టివాగు ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు కేటాయించాలన్నారు. జైనూర్ ఘటన బాధిత కుటుంబానికి రూ.10 లక్షల సాయం, కుటుంబంలో ఉద్యోగం కల్పించాలని, అక్కడ 144 సెక్షన్ ఎత్తివేయాలన్నారు.

◆ **ఎమ్మెల్యే హరీశ్‌బాబు** మాట్లాడుతూ.. బీడు, అటవీ భూముల్లో జీడీ మొక్కల పెంపకంతో ఉపాధి లభిస్తుందన్నారు. దసలిపట్టు సాగు రైతులను అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని, దీన్ని నివారించాలన్నారు.

◆ **ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు** మాట్లాడుతూ.. జోడేఘాట్‌కు మధ్యలో అటవీ అనుమతి లేక నిలిచిన 6 కి.మీ. రోడ్డును వచ్చే వర్ధంతి వరకు పూర్తి చేసేలా చూస్తాం

◆ **ఎమ్మెల్యే బొజ్జు** మాట్లాడుతూ.. 12 పోరు గ్రామాల్లోని 350 మంది ఆదివాసీలకు రెండు పడకల ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఐటీడీఏల్లో 28 శాఖలు పనిచేయాల్సి ఉండగా కొన్ని మాత్రమే చేస్తున్నాయన్నారు. వీటిని బలోపేతం చేయాలన్నారు.



జెండాలు ఆవిష్కరించి మొక్కుతున్న కుమురంభీం మనవడు సోనేరావు కుటుంబ సభ్యులు



ఆదివాసీల గుస్సాడీ నృత్యం

భీం పోరాటంతోనే గిరిజన చట్టాలు : మంత్రి సీతక్క

ఆదివాసీల హక్కుల కోసం చేపట్టిన కుమురం భీం పోరాట ఫలితమే గిరిజన చట్టాల రూపకల్పనకు దారి తీసిందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆదివాసీలకు అండగా నిలిచే స్వయం ప్రతిపత్తి కలిగిన ఐటీడీఏలు కొన్ని నిర్వీర్యమైన విషయంపై సీఎం దృష్టికి తీసుకెళ్లామని, వాటికి నిధులు కేటాయించి జవసత్వాలు తెస్తామన్నారు. కొన్నిచోట్ల అటవీశాఖ అధికారులు ఆదివాసీలపై దౌర్జన్యం చేస్తూ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. భీం నెత్తురోడిన ఈ ప్రాంతంలో భూమి ఆక్రమణలు కాకుండా చూడాలని, 12 పోరు గ్రామాల ఆదివాసీలకు ఇందిరమ్మ ఇళ్ల కోసం నివేదికలు తయారు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఇక్కడ పర్యాటక ప్రాంత అభివృద్ధికి రూ.6 కోట్లు మంజూరు చేస్తామన్నారు. యువతకు ఉపాధి కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణలు ఇప్పిస్తామన్నారు.

ఒక్కరోజు బస్సులు: ఆర్టీసీ ఒక్కరోజు కోసం ఆసిఫాబాద్, ఉట్నూర్ డిపోల నుంచి కొన్ని బస్సులు నడిపింది. జోడేఘాట్ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మినహా మిగిలినవారు దర్బార్ వైపు రాలేదు.

ఆరుగురు ఎమ్మెల్యేల గైర్హాజరు

వర్ధంతి కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులంతా హాజరవడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి భాజపాకు చెందిన ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, మహేశ్వర్‌రెడ్డి, రామారావు పాటిల్, భారాసకు చెందిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్‌కు చెందిన చెన్నూరు, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు వివేక్, వినోద్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాకపోవటం చర్చనీయాంశమైంది. మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచారి, మాజీ జడ్పీ ఛైర్మన్ గణపతి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, పీసీసీ కార్యదర్శి సత్తు మల్లేష్, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, శ్యాంనాయక్, భారత నాస్తిక సంఘం జాతీయ అధ్యక్షుడు జీడీ సారయ్య, సభ్యులు నరహరి, సంజీవ్, సంపత్, కాంగ్రెస్ నాయకులు ఆత్రం సుగుణ, భాజపా నాయకుడు అరిగెల నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు

అక్రమం చూస్తారా.. అడ్డుకట్ట వేస్తారా?

● మహారాష్ట్రకు తరలుతున్న రాయితీ బియ్యం

కాగజ్‌నగర్ గ్రామీణం, సిర్పూర్(టి), న్యూస్‌టుడే

ఉచిత రాయితీ (రేషన్) బియ్యం సరిహద్దులు దాటుతోంది. మహారాష్ట్రలో అధిక ధర పలుకుతుండటంతో.. పలువురు దళారులు దర్జాగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. బియ్యం అక్రమ రవాణాను అరికట్టాల్సిన రెవెన్యూ, పోలీసులు అడపాదడపా మాత్రమే దాడులు చేపట్టి కేసులు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వస్తూనే ఉన్నాయి.

జిల్లాకు ప్రతి నెలా మూడు వేల మెట్రిక్ టన్నుల రాయితీ బియ్యం సరఫరా అవుతోంది. డీలర్లు ప్రతి నెలా 1- 15 వరకు సరకులు పంపిణీ చేస్తారు. ప్రధానంగా బియ్యమే సరఫరా అవుతోంది. ఆహారభద్రత కార్డులు కలిగిన వారిలో దాదాపు 50 శాతం తీసుకున్న బియ్యాన్ని దళారులకు కిలోకు రూ.14 నుంచి రూ.15 వరకు విక్రయిస్తున్నారు. కాగా ఎక్కువ మొత్తంలో డీలర్లే కొనుగోలు చేస్తున్నారు. దీంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సేకరించి గోదాంలలో నిల్వ చేసుకుంటున్నారు. ఎక్కువ మొత్తంలో రాగానే ఒక వాహనంలో లోడ్ చేసుకుని కాగజ్‌నగర్ డివిజన్‌లోని దళారులు సిర్పూర్(టి) మీదుగా తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని చంద్రపూర్ జిల్లా పోడ్సా, గడ్చిరోలి జిల్లా దేవలమర్రి, ఐహిరిలకు తరలిస్తున్నారు. అక్కడి వ్యాపారులు బియ్యం కిలో రూ. 25 చొప్పున కొనుగోలు చేస్తారు. ఈ మార్గాల్లో చెక్‌పోస్టులు లేకపోవడంతో బియ్యం అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. కాగజ్‌నగర్, సిర్పూర్(టి) మండలాల్లోని దళారులు బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసి మహారాష్ట్రలోని పోడ్సాలో విక్రయిస్తున్నారు. అయితే రెవెన్యూ, ఎన్‌ఫోర్స్, టాస్క్‌ఫోర్స్ విభాగాలు సంయుక్తంగా నిఘా పెడితేనే బియ్యం అక్రమ రవాణాను అరికట్టవచ్చని ప్రజలు పేర్కొంటున్నారు.

☛ ఈ విషయంపై కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లను 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. రాయితీ బియ్యం అక్రమ రవాణాపై దృష్టిపెడతామన్నారు. ఈ మేరకు నిరోధించేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిపారు.



ద్విచక్ర వాహనంపై మహారాష్ట్రకు బియ్యాన్ని తీసుకెళ్తున్న దృశ్యం



ఇటీవల బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

రేషన్ దుకాణాలు:	కార్డుదారులు :	లబ్ధిదారుల సంఖ్య:	ఆరు నెలల వ్యవధిలో కేసులు నమోదు :	స్వాధీనం చేసుకున్న బియ్యం :
314	1,39,761	4.2 లక్షలు	86	820 క్వింటాళ్లు


తెల్లబంగారం మెరిసేనా.. మద్దతు దక్కేనా?

● కొనుగోళ్లపై నేడు సమావేశం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర పూర్తిగా పడిపోయింది. సీసీఐ కొనుగోలు చేస్తేనే రైతులకు కనీస మద్దతు ధర దక్కే అవకాశం ఉంది. రైతులకు మద్దతు ధర కల్పించేందుకు కేంద్రాల ఏర్పాటు, సౌకర్యాలు, ఎప్పుడు ప్రారంభించాలి, కొనుగోలు నిబంధనలు, తేమ శాతంపై చర్చించేందుకు నేడు ఆదిలాబాద్ కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నారు. పత్తి క్రయవిక్రయాల్లో గతేడాది ఏర్పడిన సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.






జిల్లాల వారీగా పత్తి సాగు(లక్షల ఎకరాల్లో), దిగుబడి అంచనా (లక్షల క్వింటాళ్లలో)

పంట ఇంటికి చేరుతుండటంతో కొంత మంది రైతులు పత్తి విక్రయానికి సిద్ధంగా ఉన్నారు. ఏటా దసరా తర్వాత మార్కెట్ ప్రారంభమయ్యేది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. మార్కెట్లో ధర తగ్గిపోవడంతో రైతులు సీసీఐ కొనుగోళ్లపై ఆశలు పెట్టుకున్నారు. అధికారుల అంచనా మేరకు 73.98 లక్షల క్వింటాళ్ల పత్తి వచ్చే అవకాశం ఉంది.

తేమతోనే పేచి..

పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 మధ్యన ఉండాలి. 8 శాతం తేమ ఉంటే క్వింటాలుకు మద్దతు ధర రూ.7,521 ధర వస్తుంది. అంత కంటే తక్కువగా ఉంటే.. తగ్గిన ప్రతి శాతానికి కిలో ధర తగ్గించి కొనుగోలు చేస్తారు. 12 శాతం తేమ కంటే ఎక్కువ ఉంటే సీసీఐ పత్తిని కొనుగోలు చేయదు. మార్కెట్లో పత్తి ధర క్వింటాలుకు రూ. 6,900 ఉంది. తేమ ఎక్కువగా ఉంటే మరింత తగ్గించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉండటంతో పత్తి కొనుగోలుకు వ్యాపారులు వెనుకంజ వేస్తున్నారు.

ఆధార్ తప్పనిసరి



పట్టాపాసుపుస్తకం, బ్యాంకు ఖాతా, ఫోన్ నెంబరు.. మూడు ఒకే ఆధార్‌తో అనుసంధానమై ఉంటే విక్రయాల్లో చిక్కులు ఉండవు. గత సీజన్‌లో చాలా మంది రైతుల ఆధార్ ఉపాధి హామీ బ్యాంకు ఖాతాకు అనుసంధానమై ఉండటంతో పత్తి విక్రయించిన డబ్బులు నేరుగా ఉపాధి ఖాతాలో జమయ్యేవి. కొందరు రైతుల డబ్బులు పోస్టాఫీసులో జమకావడం, వాటిని ఇతర బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తామని చెప్పి సంబంధిత అధికారి రూ.కోట్లు కాజేయడంతో రైతులు తిరిగి డబ్బులు పొందేందుకు ముప్పుతిప్పలు పడ్డారు.

◆ పత్తి పంట పండించిన రైతు నేరుగా పత్తిని విక్రయించేందుకు మార్కెట్‌కు వస్తే.. అతడి ఆధార్‌కార్డు నెంబరుతో బయోమెట్రిక్ యంత్రంలో వేలిముద్ర తీసుకొని పంటను కొనుగోలు చేస్తారు. వేలిముద్ర సరిపోకపోతే ఐరిస్‌తో పోల్చుకుంటారు. రైతు రాలేని పక్షంలో రైతు ఆధార్‌కార్డుతో పాటు అనుసంధానమై ఉన్న ఫోన్ తీసుకొని కుటుంబీకుల్లో ఎవరైనా రావాలి. అదే ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. అలా వచ్చిన ఓటీపీని నమోదు చేసి, సంబంధిత రైతు నుంచి పత్తిని కొనుగోలు చేస్తారు. రైతులు క్రయవిక్రయాల సమాచారం తెలుసుకునేందుకు మార్కెట్ శాఖ ప్రవేశపెట్టిన వాట్సాప్ నెంబరులో వచ్చే సమాచారం తప్పుల తడకగా ఉందని రైతులు అంటున్నారు. దీన్ని సరిచేయాల్సిన అవసరం ఉంది.

కొలిక్కిరాని ఎస్పీఎం, లారీ అసోసియేషన్ల వివాదం

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సిర్పూరు పేపరు మిల్లు యాజమాన్యం కిరాయి పెంచాలని లారీ అసోసియేషన్ ఆందోళనకు దిగిన వివాదం ఇంకా కొలిక్కి రాలేదు. లారీల కిరాయి పెంచాలనే డిమాండ్‌తో గత నెల 26న మిల్లు నుంచి అసోసియేషన్‌కు చెందిన 33 లారీలను కాగితం లోడ్‌తో తీసుకొచ్చి స్థానిక అసోసియేషన్ కార్యాలయం ఎదుట నిలిపివేశారు. లారీల కిరాయి పెంచేంత వరకు పేపరు లోడ్ లారీలను కదలనివ్వమని అసోసియేషన్ ఆందోళనకు దిగింది. అధికారులు, మిల్లు యాజమాన్య ప్రతినిధులు, అసోసియేషన్‌ల మధ్య పలుమార్లు జరిగిన చర్చలు ఫలించలేదు. ఈ నేపథ్యంలో పేపరులోడ్ లారీలను రోజుల తరబడి నిలుపుదల చేయడం వల్ల నష్టం వాటిల్లుతోందని మిల్లు యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను బుధవారం జారీ చేసింది. ఈ మేరకు మిల్లు లోపల పేపరు లోడ్‌తో ఇతర ప్రాంతాలకు చెందిన లారీలను పోలీసు భద్రత మధ్య ఆయా ప్రాంతాలకు పంపించారు. అసోసియేషన్‌కు చెందిన పేపరులోడ్ లారీలు అసోసియేషన్ కార్యాలయం సమీపంలోనే ఉండిపోయాయి.

ప్రాణాలతో చెలగాటం

● నిబంధనలకు విరుద్ధంగా.. ఔషధ విక్రయాలు!

కౌటాల, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యం దైవాదీనంగా మారింది. ప్రథమ చికిత్స చేయాల్సిన ఆర్ఎంపీ, పీఎంపీలు స్థాయికి మించి వైద్యం చేస్తుండగా కొన్ని మెడికల్ దుకాణ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా ఫార్మాసిస్టులు లేకుండానే విక్రయాలు జరుపుతూ కాలం చెల్లిన మందులు విక్రయిస్తున్నారు. ఆర్ఎంపీలే ముందు మెడికల్ దుకాణాలు పెట్టుకుని వెనక దర్జాగా పడకలు ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదకర ఘటన జరిగినప్పుడు హడావుడి చేస్తున్న అధికారులు.. ఆ తరువాత షరా 'మామూలు'గా తీసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

జిల్లాలో 15 మండలాలు, 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీల పరిధిలో దాదాపు వందల సంఖ్యలో ఆర్ఎంపీలు, పీఎంపీల క్లినిక్‌లు కొనసాగుతున్నాయి. ఒకటి, రెండేళ్లు ప్రైవేటు ఆసుపత్రుల్లో కాంపౌడర్లు, నర్సులుగా పనిచేసిన అనుభవంతో సొంతంగా క్లినిక్‌లు, మెడికల్ దుకాణాలు నెలకొల్పుతున్నారు.

జిల్లాలోని చాలా మెడికల్ దుకాణాల్లో మందుల (ఔషధాలు) విక్రయాలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయనే ఆరోపణలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 250కి పైగా మెడికల్ దుకాణాలు ఉండగా, నిర్వహిస్తున్న వారిలో అర్హత లేనివారే ఎక్కువ. గుర్తింపు పొందిన వైద్యుల చీటి ఉంటేనే రోగులకు ఔషధాలు విక్రయించాల్సి ఉంటుంది. కొన్ని మెడికల్ దుకాణాల్లో అర్హత లేని ఆర్ఎంపీ, పీఎంపీలు రాసిన చీటీలతో విక్రయిస్తున్నారు. మందులు అమ్మినప్పుడు తప్పనిసరిగా రశీదు ఇవ్వాల్సి ఉండగా ఎవరూ ఈ నిబంధనలను పాటించడం లేదు. ఫార్మసిస్టుతో దుకాణ నిర్వహణ కొనసాగించాల్సి ఉంది. కానీ అర్హత లేని వారు మందులను విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.



గడువు ముగిసిన సిరప్‌ను గుర్తించిన అధికారులు



చింతలమానెపల్లి మండలం డబ్బాలో తనిఖీ చేస్తున్న డీడీఓ నవత

కౌటాల మండలం గుండాయిపేట గ్రామానికి చెందిన బోయర్ కాళిదాస్, జాడె పూజలు రెండు నెలల కిందట జ్వరంతో మృతిచెందారు. జిల్లా వైద్యాధికారి తుకారం, ఇతర అధికారులు గ్రామంలో విచారణ చేపట్టారు. ఆర్ఎంపీలు ఇష్టారాజ్యంగా వైద్యం చేస్తున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో.. గ్రామంలోని ఆర్ఎంపీ క్లినిక్‌లు, మెడికల్ దుకాణాలను తనిఖీ చేశారు. ఓ ఆర్ఎంపీ వద్ద నాలుగు నెలల కిందట గడువు ముగిసిన సిరప్‌లు గుర్తించారు. అదేవిధంగా పెద్ద మొత్తంలో మందులు నిల్వ ఉండడం, ఎలాంటి పేర్లు లేకుండా చీటీల మీద మందుల పేర్లు రాసి ఉండటం బయటపడింది.



కౌటాల మండలం గుండాయిపేట మెడికల్ దుకాణంలో విచారణ చేపడుతున్న జిల్లా వైద్యాధికారి తుకారం

చర్యలు తీసుకుంటాం

- డా.నవత, డీడీఓ, లోనవెల్లి

నిబంధనల ప్రకారం ఆర్ఎంపీ, పీఎంపీలు కేవలం ప్రథమ చికిత్స చేయడానికి మాత్రమే పరిమితం కావాల్సి ఉంటుంది. కొందరు ఆర్ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేయగా మరికొందరు గడువు ముగిసిన మందులు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ విషయంపై ఇప్పటికే విచారణ పూర్తయింది. త్వరలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.



ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి సైన్సు డ్రామా పోటీలకు పయనం

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : ఆసిఫాబాద్‌లోని జన్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి సైన్సు డ్రామా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.ఉదయ్ బాబు ప్రకటించారు. ఈ నెల 18న హైదరాబాద్‌లోని ఎస్సీఈఆర్టీ గోదావరి హాలులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు గురువారం విద్యార్థులు, గైడ్ టీచర్స్ వి.రాజేశ్, డి.వెంకటేశ్వర్లు నేతృత్వంలో బయలుదేరినట్లు ఆయన పేర్కొన్నారు. కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) అనే అంశంపై విద్యార్థులు డ్రామా ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)

ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 83418 12400
వాంకిడి : 94418 88006
కౌటాల : 94401 00066

న్యూస్‌టుడే, కాగజ్‌నగర్

? పట్టణంలోని మారుతీనగర్‌లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. వర్షాలు కురిస్తే గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. *- సాదిక్, మారుతీనగర్, కాగజ్‌నగర్*

✔ నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. మంజూరు అనంతరం రోడ్ల నిర్మాణాలు చేపడతాం. *- అంజయ్య, కమిషనర్, కాగజ్‌నగర్*

న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ గ్రామీణం

? మండలంలోని నాగంపేట్-గన్నారం రోడ్డుకు అడుగడుగునా గుంతలు పడ్డాయి. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం *-అంకూస్, నాగంపేట*

✔ రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. *-రమేష్, ఎంపీడీఓ కాగజ్‌నగర్*

పర్యవేక్షించి.. సూచనలు చేసి


టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.సురేష్

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కాగజ్‌నగర్ పట్టణంలోని గుంటూర్ కాలనీ, మండలంలోని రేగులగూడ, ఊట్‌పల్లి గ్రామాల్లో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. 447 పశువులకు టీకాలు వేశామని పశువైద్యాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. గుంటూరు కాలనీలో కార్యక్రమాన్ని జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖ అధికారి డా.సురేష్ పర్యవేక్షించారు. ఈ సీజన్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే ప్రమాదం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. వీఏ శైలేందర్, గోపాలమిత్రలు రమేష్ బాబు, శ్రీనివాస్, జమీర్, తదితరులున్నారు.

ఈతచెట్ల తొలగింపు అనుమతి రద్దు చేయాలి


జిల్లా ఆబ్కారీశాఖ అధికారి జ్యోతికిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న గీత కార్మికులు

రెబ్బెన, న్యూస్‌టుడే: మండలంలోని నంబాల గ్రామ సమీప వాగును ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలోని ఈత చెట్ల తొలగింపు అనుమతి రద్దు చేయాలని కోరుతూ.. గురువారం జిల్లా ఆబ్కారీ శాఖ అధికారి జ్యోతికిరణ్‌కు గీత కార్మిక సంఘ సభ్యులు వినతిపత్రం అందజేశారు. సభ్యులు వడ్లకొండ రామాగౌడ్, రంగు మహేష్‌గౌడ్ మాట్లాడుతూ.. సుమారు 400 ఈత చెట్లను తొలగించేందుకు ఒక మాజీ ప్రజాప్రతినిధి భూమి తనదని చదును చేసుకోవడానికి అనుమతినివ్వాలని కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వాటిని తొలగిస్తే గీత కార్మిక కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. ఈ విషయంపై కలెక్టర్ దృష్టికి సారించి నిలుపుదల చేయాలని కోరారు. తాళ్లపల్లి తిరుపతిగౌడ్, ముక్కెర రవిగౌడ్, మల్లేష్‌గౌడ్ ఉన్నారు.

సీఆర్టీల నియామక ధ్రువపత్రాల పరిశీలన నేడు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలోని కస్తూర్బా విద్యాలయాలు, యూఆర్ఎస్‌లలో ఖాళీగా ఉన్న సీఆర్టీ పోస్టుల భర్తీ కోసం 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 18, 19 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.యాదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అభ్యర్థులు నిజ ధ్రువపత్రాలతో పాటు ఒక సెట్ ధ్రువీకరించిన జిరాక్స్ ప్రతులతో నిర్ణీత సమయంలో హాజరు కావాలని సూచించారు.

ప్రభుత్వం అండతో కార్మికులకు మేలు

శ్రీరాంపూర్ గ్రామీణం : రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవడంతో కార్మికులకు మేలు జరుగుతుందని సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు జె.శంకర్‌రావు పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్-3, 3ఏ గనిని సందర్శించిన ఆయన మాట్లాడుతూ సంస్థలో రాజకీయ జోక్యంతో నష్టం జరుగుతుందని ఇతర సంఘాల నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. శ్యాం, స్వామి, శ్రీనివాస్, భీంరావు, తిరుపతిరాజు పాల్గొన్నారు.

కోతకు గురై.. ప్రమాదకరంగా మారి



మండల కేంద్రం నుంచి సరాండి గ్రామానికి వెళ్లే దారిలో కల్వర్టు వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మట్టి కొట్టుకుపోయి గుంతగా ఏర్పడింది. రహదారి పక్కనే గుంత పడటంతో ప్రమాదకరంగా మారిందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అప్రమత్తంగా లేకుంటే అదుపు తప్పి పడిపోయే అవకాశాలున్నాయి. మరమ్మతుల విషయంలో ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు జరిపించాలని కోరుతున్నారు. *- న్యూస్‌టుడే, వాంకిడి*


పెంచికల్‌పేట్ మండలం జిల్లెడ గ్రామంలో..


సిర్పూర్(టి) ఎంపీడీవో కార్యాలయంలో..


బెజ్జూరు మండలం సలుగుపల్లిలో.. నినాదాలు


బీబ్రా గ్రామంలో..

గోండు వీరుడికి జన నీరాజనం

ఆదివాసీల ఆరాధ్య దైవం, పోరాట యోధుడు కుమురంభీం 84వ వర్ధంతి పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భూమి, భుక్తి కోసం, గిరిజనుల విముక్తి కోసం నిజాం సర్కారుతో వీరోచిత పోరాటం చేసి అసువులు బాసాడని వక్తలు గుర్తుచేశారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. **- న్యూస్‌టుడే, జిల్లా బృందం**


వాంకిడిలో.. భారాస నాయకులు


పీఆర్టీయూ టీఎస్ నాయకుల నినాదాలు


గువ్వలగూడలో.. ఆదివాసీ కొలవార్ సంఘ నాయకులు



కుమురం సూరుకు నివాళి

కెరమెరి: ఏటా జోడేఘాట్‌లో కుమురం భీంతోపాటు కుమురం సూరు వర్ధంతి నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు కుమురం సూరు వర్ధంతి సందర్భంగా.. ఆయన మనవడు పాండు ఆధ్వర్యంలో కొలాం ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం పూజలు చేసి నివాళులర్పించారు. మంత్రి సీతక్క, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు, ప్రేమ్‌సాగర్‌రావు, హరీశ్‌బాబు పూలమాలలు వేసి నివళులర్పించారు.

దుర్భరంగా గిరిజనుల జీవితాలు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పేరిట వేల ఎకరాల అటవీ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే నిర్ణయాలను మానుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ అన్నారు. కుమురంభీం వర్ధంతి పురస్కరించుకుని పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భీం చిత్రపటానికి నివాళులర్పించారు. నూతన ఆర్థిక విధానాలు, సరళీకరణలతో గిరిజనుల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ మాట్లాడుతూ అటవీ సంపదను కాజేస్తూ అడవి నుంచి గిరిజనులను దూరం చేసే ప్రయత్నాలు వేగవంతం అయ్యాయన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం శ్రీనివాస్, ముంజం ఆనంద్, గొడిసెల కార్తీక్, జాదవ్ రాజేందర్, బక్కన్న, వనిత తదితరులు పాల్గొన్నారు.


భీం చిత్రపటం వద్ద సీపీఎం నాయకుల నినాదాలు

పులకించిన పోరుగడ్డ

న్యూస్‌టుడే, ఆసిఫాబాద్

ఆదివాసీల హక్కుల కోసం నినదించి నిజాం తూటాలకు బలైన కుమురంభీం పోరుగడ్డ జోడేఘాట్ పులకించింది. గురువారం జోడేఘాట్‌లో భీం వర్ధంతిని అధికారికంగా నిర్వహించారు. భీం మనవడు సోనేరావు, కుటుంబ సభ్యులు, ఆదివాసీలు మొదట సంప్రదాయ బద్ధంగా పూజలు చేశారు. జెండాలు ఆవిష్కరించారు. అనంతరం భీం విగ్రహానికి, ఆయన సమాధి వద్ద భీం వారసులతో పాటు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ శ్రీనివాస్‌రావు, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీశ్‌బాబు, వెడ్మ బొజ్జు, ప్రేంసాగర్‌రావు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉద్యమ సమయంలో భీంకు సహకరించిన కుమురం సూరు వర్ధంతి పురస్కరించుకొని ఆయన విగ్రహానికి సూరు మనవడు పాండు, అధికారులు, ప్రజా ప్రతినిధులు నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన దర్బార్‌లో సోనేరావు, పాండు కుటుంబ సభ్యులను సత్కరించారు. దుస్తులు అందించారు.



మ్యూజియం తిలకించి..

ఉత్సవానికి వచ్చిన వారు అక్కడి మ్యూజియంను ఆసక్తిగా తిలకించారు. భీం పోరాట సమయంలో వాడిన ఆయుధాలు, వస్తువులు, ఆదివాసీల సంప్రదాయ కళలు, దేవతామూర్తులు, చిత్రాలను బారులుగా తరలివచ్చి తిలకించారు. స్వీయ చిత్రాలు తీసుకుంటూ సంతోషంగా గడిపారు. చారిత్రక విషయాలు తెలుసుకున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గోండ్, కోయ, కొలాం, ఆంద్, నాయక్‌పోడ్.. ఇలా తొమ్మిది తెగల వారు తమ సంప్రదాయ గుస్సాడీ, తప్పెట గుండ్లు, ధింసా, డోలక్ నృత్యాలను ప్రదర్శించి ప్రత్యేకత చాటారు.


డోలక్ నృత్యం చేస్తున్న ఆంద్ తెగ సభ్యులు

భారీ బందోబస్తు..

ఉత్సవం ప్రశాంతంగా నిర్వహించేలా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఎస్పీ, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావుల పర్యవేక్షణలో ముగ్గురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 28 మంది ఎస్సైలతో పాటు మరో 460 మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, ప్రత్యేక పోలీసు బలగాలతో భద్రత చర్యలు చేపట్టారు.

స్టాళ్ల ప్రదర్శన..

వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉత్సవానికి వచ్చిన వారు తిలకించారు. ఐటీడీఏ, ఐసీడీఎస్, డీఆర్‌డీవో, విద్య, వైద్య.. ఇలా వివిధ శాఖలు తాము అమలు చేస్తున్న, నిర్వహిస్తున్న వాటిని ప్రదర్శించారు.

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ..

వర్ధంతి ఉత్సవం, దర్బార్‌కు వచ్చే ఆదివాసీలు, గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేశారు. పలు టేబుళ్లను ఏర్పాటు చేసి ప్రత్యేక సిబ్బందిని నియమించి దరఖాస్తులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ఎడ్ల జతలు, మేకలు, స్ప్రింక్లర్లు, రుణాలు, తాగునీటి సమస్యలు, గృహాలు.. ఇలా వివిధ సమస్యలపై 301 మంది దరఖాస్తులు అందించారు. వీటిని సంబంధిత సిబ్బంది నమోదు చేసుకున్నారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును 15 రోజుల్లో పరిష్కరించేలా చూస్తామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొనడంతో ఆదివాసీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్ రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు అరిగెల నాగేశ్వర్‌రావు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు అజ్మీర శ్యాంనాయక్, ఆత్రం సుగుణ, ఆదివాసీ సంఘాల సభ్యులు కుడ్మెత విశ్వనాథం, గణపతి, దుర్గు పటేల్, మాణిక్‌రావు, భారత నాస్తిక సంఘం జాతీయ అధ్యక్షుడు జీడీ సారయ్య సభ్యులు నరహరి, సంజీవ్, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు


ఫిర్యాదుల విభాగంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, సిబ్బంది

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి

చింతలమానెపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై నుంచి కింద పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని గూడెం అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. గూడెం గ్రామానికి చెందిన రాంటెంకి శంకర్(48) ద్విచక్రవాహనంపై గురువారం మండల కేంద్రం వైపు వస్తున్న క్రమంలో రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఉండటంతో అదుపుతప్పి పడిపోయారు. తీవ్రంగా గాయపడ్డ అతన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొని వెంటనే మహారాష్ట్రలోని ఆహేరికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో.. ఒకరికి గాయాలు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారిపై రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాల మూలమలుపు వద్ద గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో.. వాహన చోదకుడు శ్రీకాంత్(25)కు తీవ్ర గాయాలయ్యాయి. కాగజ్‌నగర్ మండలం బోడెపల్లికి చెందిన శ్రీకాంత్ ద్విచక్రవాహనంపై ఆసిఫాబాద్ నుంచి కాగజ్‌నగర్ వైపు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. తలకు, కాళ్లకు గాయాలైన అతన్ని కాగజ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు.

స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలి



ర్యాలీగా వస్తున్న యువకులు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: సిర్పూర్ పేపర్ మిల్లులో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పలువురు యువకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ర్యాలీగా వెళ్లి ఎస్పీఎం ఏజీఎం రమేశ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. మిల్లులో స్థానికేతరులకు అధిక వేతనాలు చెల్లిస్తూ స్థానికులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. యాజమాన్యం స్పందించి స్థానిక యువకుల అర్హతల ఆధారంగా ఉపాధి కల్పించాలని, లేకుంటే దశల వారీగా ఉద్యమాలు చేపడతామని తెలిపారు. కౌన్సిలర్ జైచందర్, నాయకులు వనమాల రాము, ఇనుముల ఉమాకాంత్, రాము, శ్రీకాంత్, సూరజ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

మాలీ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడికి సన్మానం

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండలంలోని చిన్నసిద్దాపూర్ గ్రామానికి చెందిన టాకిరే గణపతి స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా నియమితులయ్యారు. దీంతో మండల కేంద్రంలో మాలీ సంఘం ఆధ్వర్యంలో గురువారం గణపతిని శాలువాతో సన్మానించారు. సంఘం మండల అధ్యక్షుడు ఆదే అశోక్, సభ్యులు మోహన్, శంకర్, గోపాల్, సురేష్, రంగయ్య, యువకులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సమావేశాలు



గోడపత్రులు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్, తదితరులు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : కాగజ్‌నగర్ పట్టణంలో నవంబరు 2, 3 తేదీల్లో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సమావేశాలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ కోరారు. గురువారం సంఘం కార్యాలయ ఆవరణలో గోడప్రతులు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ విద్యారంగ, సామాజిక సమస్యలపై ఉద్యమిస్తూ ఎస్ఎఫ్ఐ పనిచేస్తోందన్నారు. జిల్లా కార్యదర్శి చాపిలె సాయికృష్ణ మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల సమస్యల పరిష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా యాత్రలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేశామని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు వసాకె సాయికుమార్, జిల్లా సహాయ కార్యదర్శులు సుంకరి సాయి, నితీష్, అయూబ్, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసి.. వినతిపత్రాలు ఇచ్చి

రెబ్బెన, న్యూస్‌టుడే: గోలేటిలోని సింగరేణి అతిథి గృహానికి వచ్చిన మంత్రి సీతక్కకు గురువారం పలువురు వినతిపత్రాలు అందజేశారు. సీఆర్టీ ఉపాధ్యాయులు శ్రీనివాస్, విజేష్, వెంకటేష్, నాగేష్, గోపాల్ మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ శాఖ ఏకోపాధ్యాయ, ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్‌కు మినిమం టైమ్ స్కేం అమలు చేయాలని మంత్రిని కోరారు. తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు తోట లక్ష్మణ్, బోగే ఉపేందర్, ఆజ్మీర బాబురావు మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన అంశాల ప్రకారం ఉద్యమకారులకు 200 గజాల స్థలం, ఇందిరమ్మ ఇల్లు, ఉచిత బస్సు పాస్, పింఛను ఇవ్వాలని కోరారు. ఖైరిగూర ఓసీపీ నుంచి జీ-13 గ్రేడ్ బొగ్గు రోడ్డు రవాణా ద్వారా కల్పించాలని రెబ్బెన లారీ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు.

కెరమెరి: గిరిజన శాఖలో పనిచేస్తున్న దినసరి, తాత్కాలిక ఉద్యోగుల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ.. జోడేఘాట్‌లో మంత్రి సీతక్కకు నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు కేబీసీ నారాయణ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ప్రతి నెలా వేతనాలు ఇచ్చేలా ముందస్తు బడ్జెట్ కేటాయించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.


గోలేటిలో మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న సీఆర్టీ ఉపాధ్యాయులు

పోస్టుమార్టం చేయలేదని బాధితుల ఆవేదన

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : ఆడుకుంటూ నీటి బకెట్‌లో మునిగి మృతి చెందిన పది నెలల బాలుడు తన్వీర్ మృతదేహానికి పోస్టుమార్టం చేయకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. గురువారం ప్రమాదవశాత్తు నీటమునిగిన బాలుడిని వెంటనే తల్లిదండ్రులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఓ రాజకీయ నాయకుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైద్యుడితో మాట్లాడి మృతదేహాన్ని తీసుకెళ్లమనడంతో ఇంటికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తీరా వెళ్లిన వెంటనే పోలీసులు ఇంటికి వచ్చి పోస్టుమార్టం నిర్వహించకుండా ఎలా తీసుకొస్తారని తిరిగి ఆసుపత్రికి తీసుకొచ్చినట్లు చెప్పారు. కానీ మరుసటి రోజు చేస్తామని వైద్యులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న జీఎం ఎం.శ్రీనివాస్


వాంకిడిలో నివాళులర్పిస్తున్న గంగపుత్ర సంఘం నాయకులు


రెబ్బెనలో..

వాల్మీకి మహర్షి చూపిన మార్గంలో నడుద్దాం

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: ఒక ఆదర్శ గురువుగా ఆయన చూపిన మార్గంలో నడవడమే వాల్మీకి మహర్షికి ఇచ్చే నిజమైన గురు దక్షిణ అని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి జీఎం పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. రామాయణంలోని నీతి వ్యాఖ్యలను గుర్తు చేశారు. ఏరియా ఎస్ఓటు జీఎం రాజమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీజీఎం (ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహరా, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, అధికారులు పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని గంగపుత్ర కాలనీలో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి, వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచి బండె తుకారాం, పటేల్ బామినె రామ, టెంకె బిక్కాజి, శ్రావణ్, దిన్‌కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీపీవో ఏవో శ్రీనివాస్ రెడ్డి, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోలేటి టౌన్‌షిప్: తహసీల్దార్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి తహసీల్దార్ పి.రామ్మోహన్ రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్ఐ ప్రేమ్‌కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు టీకా.. రైతులకు భరోసా

కౌటాల, న్యూస్‌టుడే :

పశువుల్లో అనేక వ్యాధులు వ్యాపిస్తున్న తరుణంలో గాలికుంటు వ్యాధి నివారణకు అధికారులు చర్యలు ప్రారంభించారు. జాతీయ పశు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా.. జిల్లాలోని ఆవులు, ఎద్దులు, గేదెలకు టీకాలు వేసే ప్రక్రియను ఈ నెల 16వ తేదీ నుంచి మొదలుపెట్టగా.. నవంబరు 15వ తేదీ వరకు కొనసాగనుంది. పశువులకు సంక్రమించే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉంటూ వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని పశు సంవర్ధకశాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వం అందించే టీకాను ప్రతి ఆరు నెలలకు ఒకసారి వేసి గాలికుంటు వ్యాధిని పూర్తిగా నివారించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.


కౌటాల మండలం తలోడిలో పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న సిబ్బంది

జిల్లాలో

ఆవులు	గేదెలు
2,93,895	46,374

జిల్లాలోని రెండు ఏరియా పశువైద్యశాలలు ఉండగా 18 ప్రాథమిక పశువైద్యశాలలు, ఏడు సబ్‌సెంటర్లు ఉన్నాయి. గాలికుంటు వ్యాధి నివారణకు క్షేత్రస్థాయిలో 28 బృందాలు టీకాలు వేసే కార్యక్రమం చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

వ్యాధి లక్షణాలు..

- గాలికుంటు సోకితే తీవ్ర జ్వరంతో పాటు పశువులు నీరసంగా కనిపిస్తుంటాయి. ముఖ్యంగా దుక్కిటెడ్లలో పని సామర్థ్యం తగ్గుతుంది.
- నోటి నుంచి తీగల మాదిరిగా సొంగ కారుతుంది.
- నోటి మధ్యలో, కాలిగిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి.

నష్టాలు..

- పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది.
- వ్యాధి సోకిన తల్లి పాలు తాగిన దూడలు మృత్యువాత పడతాయి.
- సకాలంలో వైద్యం అందకపోతే వ్యాధి ముదిరి పశువు చనిపోతుంది.


ప్రత్యేక కార్యాచరణ

గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా నెల రోజుల పాటు టీకాల కార్యక్రమాన్ని చేపట్టారు.

సద్వినియోగం చేసుకోవాలి

గాలికుంటు వ్యాధి సోకకుండా ప్రతి రైతు తమ పశువులకు టీకాలు వేయించాలి. జిల్లాలోని అన్ని పశువైద్యశాలల్లో టీకాలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే ఆవుల్లో లంపీస్కిన్ (ముద్దచర్మ) వ్యాధికి టీకాలు వేయించాం. ప్రస్తుతం ఆ వ్యాధులు అదుపులోనే ఉన్నాయి. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా వెంటనే సంబంధిత వైద్యాధికారులను సంప్రదించాలి. **- సురేష్, జిల్లా పశువైద్యాధికారి**


పూలతో కనువిందు చేస్తున్న యాపల్‌గూడ పాఠశాల


ఆకట్టుకుంటున్న బడి తోట


పాఠాలు వింటున్న విద్యార్థులు

ప్రకృతి ఒడి.. చదువులమ్మ బడి

ఆదిలాబాద్ మండలం యాపల్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణ విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషితో పచ్చదనంతో కళకళలాడుతోంది. పచ్చని చెట్ల నీడ, చల్లటి గాలితో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. వివిధ రకాల పూలమొక్కలతో పాటు అలంకరణ మొక్కలు పెంచారు. వీటిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సంరక్షిస్తున్నారు. కిచెన్ గార్డెన్‌లోనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు లభిస్తున్నాయి. తరగతి గదులు, పాఠశాల ప్రహరీపై వివిధ అక్షరాలు, సామెతలు, మహనీయుల చిత్రాలను గీయించి విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేలా తయారు చేశారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, పరిశుభ్రమైన వాతావరణంలో వంటగది ఉంది. రూ.లక్ష ఖర్చుతో వెయ్యి పుస్తకాలతో గ్రంథాలయం ఏర్పాటు చేసుకున్నారు. ఈ బడికి స్వచ్ఛ విద్యాలయం పురస్కారం లభించింది. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగన్న, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల సభ్యుల అంకితభావం తోడు కావడంతో ప్రైవేటు పాఠశాలకు దీటుగా చదువు, వసతులతో ఆదర్శంగా నిలుస్తోంది. ఒకప్పుడు 120 మంది విద్యార్థులు ఉండగా.. ఉపాధ్యాయుల కృషితో ప్రస్తుతం 310 మందితో ఆంగ్ల మాధ్యమంలో కొనసాగుతోంది. జైనథ్ నుంచి కూడా ఈ పాఠశాలకు చదువుకోవడానికి విద్యార్థులు వస్తున్నారు.

- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం



సొరకాయ @ 4 అడుగులు



సొరకాయ సాధారణంగా ఒక అడుగు లేదా రెండు అడుగుల పొడవు ఉంటుంది. కుమురం భీం జిల్లా కెరమెరికి చెందిన రైతు వాగ్మారే లక్ష్మణ్ పంట చేనులో నాలుగు అడుగుల పొడవైన సొరకాయ కాసింది. కాయను సదరు రైతు ఇంటికి తీసుకెళ్తుండగా.. స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

న్యూస్‌టుడే, కెరమెరి (జైనూర్)

అడుగులు తడబడి.. ఆగిన ఊపిరి

● నీటి బకెట్‌లో పడి పది నెలల బాలుడి దుర్మరణం



వాంకిడి, న్యూస్‌టుడే: బుడి బుడి అడుగులు వేస్తున్న కుమారుడిని చూసి మురిసిపోతున్న తల్లిదండ్రులకు.. ఆ అడుగులు తీవ్ర గుండెకోతను మిగిల్చాయి. వంశాంకురం పుట్టాడని అల్లారుముద్దుగా పెంచుకుంటున్న అంతలోనే విగతజీవిగా మారేసరికి తల్లడిల్లిపోయారు. పది నెలల వయసులోనే నూరేళ్లు నిండిన చిన్నారి మరణం ఆ కుటుంబాన్ని విషాదంలో నెట్టింది. వాంకిడి మండలంలో ఓ చిన్నారి ఆడుకుంటూ నీటి బకెట్‌లో పడి మృత్యువాత పడ్డ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తేజాపూర్ గ్రామానికి చెందిన చౌదరి గిర్మాజీ-సునీత దంపతులకు ఇద్దరు కుమారులు. కుమారుడు తన్వీర్ (పది నెలల వయసు) ఉన్నారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో గిర్మాజీ వ్యవసాయ పనులకు వెళ్లగా సునీత ఇంటి పనుల్లో నిమగ్నమైంది. ఈ క్రమంలో తన్వీర్ ఆడుకుంటూ బాత్‌రూంలోకి వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడిపోయాడు. కుమారుడు కనిపించకపోయేసరికి తల్లి ఇంటి ఆవరణలో వెతకగా బాత్‌రూంలోని బకెట్‌లో విగతజీవిగా కనిపించాడు. వెంటనే ఆసిఫాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. నీటిలో ఊపిరాడక మృతి చెంది ఉంటాడని వైద్యులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పోశెట్టి తెలిపారు.

మరో నాలుగేళ్లు ఉచిత బియ్యం పంపిణీ

● కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పేదలకు లబ్ధి



కోటపల్లి మండలం రాపన్‌పల్లిలో చౌకధరల దుకాణంలో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

చెన్నూరు గ్రామీణం, ఏసీసీ, న్యూస్‌టుడే : కొవిడ్ సమయంలో ఆర్థికంగా ఇబ్బందులకు గురైన పేదలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. 2021 నుంచి మూడు నెలలకోసారి పథకాన్ని పొడిగిస్తూ వస్తున్న కేంద్రం.. 2023 డిసెంబరులో ఒకేసారి ఏడాది పాటు ఉచిత బియ్యం అందించనున్నట్లు ప్రకటించింది. ఈ గడువు డిసెంబరులో ముగియనుండటంతో ఇటీవల భేటీ అయిన కేంద్ర మంత్రివర్గం ఈ పథకాన్ని మరో నాలుగేళ్ల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. 2028 డిసెంబరు వరకు ఆహార భద్రత కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీకి కేంద్రం ఈ నెల 9న ఆమోదం తెలపడంతో లక్షలాది మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలగనుంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,60,627 ఆహార భద్రతకార్డులు ఉండగా.. 23,93,693 మంది లబ్ధిదారులు ఉన్నారు. కార్డులో ఉన్న ప్రతి లబ్ధిదారుడు నెలకు అయిదుకిలోల చొప్పున ఉచితంగా బియ్యాన్ని పొందుతున్నాడు. ప్రభుత్వం ప్రతినెల సుమారు 19,709.60 క్వింటాళ్ల బియ్యాన్ని ఉచితంగా అందిస్తోంది.

ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ

ఆహార భద్రత కార్డుదారులకు కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వం ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తోంది. ప్రస్తుతం పంపిణీ చేసేందుకు నిర్ణయించిన బియ్యం సైతం పోషకాలు కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యం మాత్రమే పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో పేదలకు బలవర్ధకమైన బియ్యం పంపిణీ మరో నాలుగేళ్ల పాటు కొనసాగనుంది. ఈ బియ్యంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి-12 పోషకాలు ఉంటాయి.



ఎలాంటి ఉత్తర్వులు అందలేదు

ఉచిత బియ్యం పంపిణీని పొడిగిస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. బియ్యం పంపిణీలో ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

- బ్రహ్మారావు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మంచిర్యాల

నీటి పారుదల శాఖకు కొత్తగా 52 మంది ఏఈఈలు

ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న ఏఈఈ(అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్) పోస్టులు భర్తీ అయ్యాయి. ఉమ్మడి జిల్లాకు 52 మందిని కేటాయించగా, ఆదిలాబాద్ జిల్లాకు 8, నిర్మల్‌కు 16 మంది, మంచిర్యాలలో 12, కుమురం భీం జిల్లాకు 16 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన ఏఈఈలను జిల్లాల వారీగా కేటాయించడంతో పాటు ఆయా సబ్‌డివిజన్ కార్యాలయాల్లో విధుల్లో చేరాలని ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాల వారీగా కొత్తగా ఏఈఈలు రావడంతో నీటి పారుదల శాఖ పరిధిలో పనులు మరింత వేగవంతం అయ్యే అవకాశం ఉంది.

చిగురిస్తున్న ఆశలు

● రాయితీపై వ్యవసాయ సామగ్రి అందజేయనున్న సర్కారు



దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే:

సేద్యం చేయడానికి గతంలో ఎద్దులు, నాగళ్ల అవసరం ఉండేది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో అన్ని రంగాల్లోనూ ఆధునిక యంత్రాలు, పరికరాల వినియోగం పెరిగింది. దున్నడం మొదలు పంట నూర్పిడి వరకు ఆధునిక యంత్రాలు వినియోగిస్తున్నారు. గతంలో వ్యవసాయశాఖ పరంగా రాయితీతో కూడిన వివిధ పథకాలు అమలులో ఉండేవి. వ్యవసాయ సామగ్రి, యంత్రాలు రైతులకు మంజూరయ్యేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పాలకులు ఈ పథకాలను పక్కన పడేశారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ రాయితీ పథకాలను అమలుకు శ్రీకారం చుట్టేందుకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో సన్న, చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ, బీసీవర్గాల రైతుల్లో ఆశలు చిగురిస్తున్నారు.

✷ వ్యవసాయశాఖపరంగా ఇప్పటికే రైతు బంధు(రైతు భరోసా), రైతు బీమా పథకాలు అమలవుతున్నాయి. తాజాగా రాయితీతో కూడిన పథకాలు అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకు ఏటా రూ.600 కోట్లు ఖర్చు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు.

ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)

● జిల్లా	● రైతులు (లక్షల్లో)	● వరిసాగు విస్తీర్ణం	● పత్తి సాగు
మంచిర్యాల	1.45	1,80,567	1,21,704
ఆదిలాబాద్	1.22	1,984	3,87,213
నిర్మల్	1.54	95,824	1,37,390
కుమురం భీం	0.97	58,904	2,98,779

యంత్రాలివే..

రాయితీపై అందించే యంత్రాల్లో రోటావేటర్లు, కల్టివేటర్, దమ్ముచక్రాలు, గొర్రు, పిచికారీ యంత్రాలు, బోరు మోటార్లు, టార్పాలిన్లు రాయితీపై అందనున్నాయి.

తప్పనున్న కొనుగోలు 'భారం'

బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిన ధరలకు పరికరాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొన్ని మండలాల్లో గ్రామైక్య సంఘాలకు ప్రభుత్వం వివిధ రకాల సామగ్రి మంజూరు చేసినప్పటికీ ప్రచారలోపం, ఆయా సంఘాల మహిళలకు వాటిపై పట్టు దొరక్కపోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఏదైమైనప్పటికీ ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఏటా వేలాది మంది రైతులకు రాయితీపై పరికరాలు అందనున్నాయి.


చెట్టు కింద పడి ఉన్న గొర్రెలు, మేకల కళేబరాలు

పిడుగుపాటుతో గొర్రెలు, మేకలు మృతి

సారంగాపూర్, న్యూస్‌టుడే : నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం రాసింగ్‌తండా సమీపంలో గురువారం సాయంత్రం పిడుగుపడి గొర్రెలు, మేకలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన చవాన్ ఇనేష్ అనే రైతు తన గొర్రెలు, మేకలను మేతకు తీసుకెళ్లాడు. భారీ వర్షం కురవడంతో జీవాలను ఓ చెట్టు కిందకు చేర్చాడు. అదే సమయంలో పిడుగు చెట్టుపై పడటంతో అక్కడ ఉన్న 60 గొర్రెలు, 5 మేకలు మృతి చెందాయి. స్థానిక మార్కెట్ కమిటీ ఛైర్మన్ అబ్దుల్ హాది ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు.

అమ్మాయిలు.. పతక విజేతలు

● జాతీయస్థాయి కబడ్డీలో రాణింపు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం :

ఒకవైపు పేదరికం.. మరోవైపు క్రీడలంటే ఇష్టం.. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఆ బాలికలు రాష్ట్ర, సొసైటీ క్రీడలు, జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు.. పతకాలు సాధిస్తున్నారు.. ఇటీవల ఆదిలాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చాటారు.. ఆల్‌రౌండర్లుగా గుర్తింపు తెచ్చుకుంటున్న వీరంతా జట్టు గెలుపులో కీలక పాత్ర పోషిస్తున్నారు.. క్రీడా విభాగంలో ప్రభుత్వ కొలువులు సాధించడమే తమ లక్ష్యమని చెబుతున్నారు.


కబడ్డీ ఆటలో తలపడుతున్న బాలికలు

క్రీడాకారిణిగా గుర్తింపు పొందాలని.

- సిడాం తుక్కరాణి



మాది ఆదిలాబాద్. ఇంద్రవెల్లిలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. ఎనిమిదో తరగతి నుంచి కబడ్డీ ఆడుతున్నా. ఇప్పటి వరకు రెండుసార్లు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నా. ఉత్తమ డిఫెండర్‌గా, రైడర్‌గా పురస్కారం అందుకున్నా. జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పసిడి పతకం సాధించాలని, క్రీడా కోటాలో పోలీసు ఉద్యోగం పొందాలన్నదే ధ్యేయంగా పెట్టుకున్నా.

ప్రో-కబడ్డీలో ఆడాలని..: ఆర్.అనూషా



మాది తలమడుగు మండలం సుంకిడి గ్రామం. అక్కడే జడ్పీఎస్ఎస్‌లో పదో తరగతి చదువుతున్నా. సూర్యాపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నా. పీడీ నాందేవ్ శిక్షణలో మంచి రైడర్‌గా ప్రావీణ్యం పొందా. జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ క్రీడాకారిణిగా పేరు తెచ్చుకోవాలని, ప్రో-కబడ్డీ పోటీల్లో ఆడాలని ఉంది. పాఠశాల సెలవు అనంతరం రోజూ రెండు గంటలు సాధన చేస్తున్నా.

సైన్యంలో చేరాలని..: టేకం అంజలి



మాది రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామం. ఇచ్చోడలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీలో పదో తరగతి చదువుతున్నా. మూడేళ్లుగా కబడ్డీ ఆట ఆడుతున్నా. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఇప్పటికే మూడుసార్లు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని ఉత్తమ రైడర్‌గా ఎంపికయ్యా. సైన్యంలో చేరాలన్న తన చిన్నప్పటి కలను సాకారం చేసేందుకు కబడ్డీ కోర్టులో తీవ్రంగా శ్రమిస్తున్నా. ఆ ఆటలోని మరిన్ని మెలకువలు నేర్చుకుంటున్నా.

పోలీసు కావాలని..

- బి.సోనాలి



మాది ఇంద్రవెల్లి. ఆదిలాబాద్‌లోని టీఎస్‌డబ్ల్యూఆర్ ఎస్‌లో పదో తరగతి చదువుతున్నా. నిజామాబాద్, గజ్వేల్, సూర్యాపేట, హనుమకొండ, మంచిర్యాల ప్రాంతాల్లో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నా. బిహార్, రాజస్థాన్, ఝార్ఖండ్ వేదికల్లో నిర్వహించిన జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించా. ఒకసారి ఉత్తమ రైడర్‌గా ఎంపికయ్యా. క్రీడా విభాగంలో పోలీసు కావాలనే లక్ష్యంతో తీవ్రంగా సాధన చేస్తున్నా.

బాసర ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతి బాధ్యతల స్వీకరణ


ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్‌ను సన్మానిస్తున్న మాజీ ఉపకులపతి వెంకటరమణ

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతిగా గోవర్ధన్ గురువారం హైదరాబాద్‌లోని ఆర్జీయూకేటీ క్యాంపు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఇది వరకు ఇన్‌ఛార్జి ఉపకులపతిగా పని చేసిన వెంకటరమణ, పరిపాలన విభాగం అధికారి రణధీర్‌లు స్వాగతం పలికారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు సంతోషంగా ఉందన్నారు. శుక్రవారం బాసర ఆర్జీయూకేటీకి వచ్చి పరిశీలిస్తానన్నారు.

ప్రమాదాల దారి.. పర్యవేక్షణ ఏది?

● ప్రజాప్రతినిధులు స్పందిస్తేనే మేలు

ఈటీవీ - ఆదిలాబాద్ :

నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఐఏ) విభాగం నిర్లక్ష్యంతో ఆదిలాబాద్ - నిర్మల్ మధ్య ఉన్న 44వ నెంబరు జాతీయ రహదారి రక్తమోడుతోంది. నిర్మల్ కేంద్రంగా ఉండే ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్(పీడీ) కార్యాలయం కరోనా సమయంలో కామారెడ్డికి మారింది. అప్పటి నుంచి నిర్మల్ జిల్లా సోన్ నుంచి ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం డొల్లార వరకున్న 115 కి.మీ. రహదారి నిర్వహణపై ఆ శాఖ పర్యవేక్షణ లేకుండాపోయింది.

✷ తాజాగా ఈ నెల 6న జైనథ్ మండలం పిప్పర్‌వాడ టోల్ ప్లాజా సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా రహదారిపైనే లారీని నిలిపారు. పొగమంచు కారణంగా లారీని పసిగట్టలేక ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఆదిలాబాద్ శాంతినగర్ విద్యార్థి హర్షవర్ధన్ మృతి చెందటం విషాదానికి దారితీసింది.

రోడ్డుపై వాహనాలు నిలపరాదు. ఎన్‌హెచ్ అనుమతి లేకుండా రహదారిని ఆనుకొని దాబాలు నిర్వహించరాదు. అనుమతి ఉంటే రోడ్డుకు ఆనుకొని 10 మీటర్ల స్థలం వదిలేసి ప్రవేశం(ఎంట్రీ), నిష్క్రమణ(ఎగ్జిట్) మార్గాలుండాలనే నిబంధనలు అమలుకాక ప్రమాదాలకు దారితీస్తోంది.



నిర్మల్ జిల్లా గంజాల్, ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ, జైనథ్ మండలం పిప్పర్‌వాడ దగ్గర ఏర్పాటుచేసిన టోల్‌ప్లాజాలు ద్వారా ఎన్‌హెచ్ విభాగం డబ్బులు వసూలు చేయటానికి అనుమతిచ్చిందే తప్పితే ప్రమాదాలకు కారణాలపై దృష్టి పెట్టడం లేదు. నిర్మల్, ఖానాపూర్, బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గాల పరిధిలోని మూడు టోల్ ప్లాజాల ద్వారా సగటున రోజుకు 10 వేల వాహనాల రాకపోకలు జరుగుతాయనేది అంచనా. ఒక్కో ప్లాజాకు రూ.40 లక్షల చొప్పున మూడింటి ద్వారా రూ.1.20 కోట్లు వాహనదారులు చెల్లించాల్సి వస్తోంది. నిబంధనల ప్రకారం టోల్ వసూళ్లకు అనుమతిస్తున్న అధికారులు ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టడం లేదు. ప్రజాప్రతినిధులు ప్రశ్నించకపోవటం రహదారి నిర్వహణను చూసే గుత్తేదారులకు కలిసొస్తోంది.

గాల్లో కలుస్తున్న ప్రాణాలు

నేరడిగొండ టోల్ ప్లాజా దగ్గర రోడ్డుపైనే వాహనాలు నిలిపి ఉన్న దృశ్యమిది. గంజాల్, పిప్పర్‌వాడ సహా రోడ్డును ఆనుకొని ఉన్న ప్రతి దాబా దగ్గర ఇదే పరిస్థితి. కొన్ని దాబాల్లోనైతే మద్యం తాగి, భోజనాలు చేస్తున్నా ఎన్‌హెచ్, పోలీసు, ఆబ్కారీ శాఖాధికారులు పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఈ ఏడాది జనవరి 8న మావల బైపాస్ దగ్గర అపసవ్య దిశలో వచ్చిన కంటైనర్ ఢీకొనడంతో ఆదిలాబాద్‌కు చెందిన అఖిలేష్(29) మృతి చెందారు.



చేయాల్సిందేమిటి?

✷ ఎన్‌హెచ్, రెవెన్యూ, పోలీసు, రవాణా, ఆబ్కారీ అధికారులతో సంయుక్త సమావేశాలు నిర్వహించి ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను అన్వేషించాలి.

✷ కామారెడ్డి ఎన్‌హెచ్ పీడీకి అనుబంధంగా ఆదిలాబాద్, నిర్మల్ కేంద్రాలుగా డివిజన్ కార్యాలయాలు ఏర్పాటుచేయాలి.

✷ దాబాల్లో మద్యం, గంజాయి వినియోగాన్ని అరికట్టాలి.

✷ 25 కి.మీ.లకు ఒక అంబులెన్సును అందుబాటులో ఉంచాలి.

✷ 2012లో చేసిన సర్వేలో గుర్తించిన 53 ప్రమాద పాయింట్లలో ఎలాంటి చర్యలు తీసుకున్నారనేది వెల్లడించాలి.

✷ గుడిహత్నూర్-జందాపూర్, గిమ్మ బైపాస్ దగ్గర వంతెనలు సహా రెండు వైపులా సర్వీసు రోడ్లు అందుబాటులోకి తేవాలి.

☛ గత నెల 30న అర్ధరాత్రి గుడిహత్నూర్ మండలం మేకలగండి దగ్గర జరిగిన ప్రమాదంలో మహ్మద్ ఉస్మాన్ ఉద్దీన్, సయ్యద్ మహ్మద్ అలీ, సయ్యద్ మొహిజొద్దీన్, మొహినొద్దీన్, మహ్మద్ ఫరీద్ ఉద్దీన్ మృతి చెందారు. వీరంతా ఆదిలాబాద్ టీచర్స్ కాలనీలోని ఒకే కుటుంబానికి చెందినవారు.

ఫెన్సింగ్ ఎంపిక పోటీలు

నస్పూర్, న్యూస్‌టుడే : శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫెన్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్, స్కూల్ గేమ్స్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-14, 17, 19 విభాగంలో బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫెన్సింగ్ అసోసియేషన్ ఫౌండర్ రమేష్, క్రీడా సమాఖ్య కార్యదర్శులు ఫణిరాజా, బాబు రావు తదితరులు పాల్గొన్నారు.


హాజరైన క్రైస్తవులు

అందరూ దైవ సమానులే: మంత్రి సీతక్క


కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వినోద్

కాసిపేట, న్యూస్‌టుడే: కులమతాల మధ్య భేదాలు సృష్టించుకోవద్దని, అందరూ దైవ సమానులే అని మంత్రి సీతక్క అన్నారు. బెల్లంపల్లి మండలం సోమగూడెంలోని కల్వరి చర్చి పాస్టర్ ప్రవీణ్ 50 రోజుల ఉపవాస దీక్ష ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రైస్తవుల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. దాదాపు లక్ష పైచిలుకు క్రైస్తవ భక్తులతో సభ ప్రాంగణం నిండిపోయింది. ప్రపంచ శాంతి కోసం ఏటా 50 రోజుల పాటు ఉపవాస దీక్షలను చేపడుతున్నట్లు పాస్టర్ ప్రవీణ్ చెప్పారు. ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ ఈ ఉపవాస దీక్షతో తమ ప్రాంతం దేశం మొత్తం తెలిసిందన్నారు. ప్రపంచ స్థాయిలో కల్వరి ఇంతలా పేరు సాధించడం సంతోషకారణమని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, మున్సిపల్ ఛైర్మన్ శ్వేత, రవికుమార్, నాతరి స్వామి, రాంచందర్ తదితరులున్నారు.